## నేడు బీఆర్ఎస్ భేటీ

కొడంగల్, మార్చి 10: వచ్చే పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జేజేఆర్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొంటారని, ముఖ్య అంశాలపై చర్చ ఉంటుందని, ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన సూచించారు

## నేటి నుంచి ఎల్‌సీడీసీ సర్వే

బొంరాస్‌పేట, మార్చి 10 : కుష్ఠువ్యాధి అనుమానితుల గుర్తింపునకు సోమవారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపే యిన్ (ఎల్‌సీడీసీ) నిర్వహిస్తున్నట్లు జిల్లా లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీంద్ర యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆశ కార్యకర్తలు ప్రతి రోజూ 25 ఇండ్లను సందర్శించి శరీరంపై తెల్లని మచ్చలు ఉన్నవారిని గుర్తించి సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రిపోర్ట్ చేస్తారని ఆయన తెలిపారు. ఇంటింటి సర్వేకు వచ్చే ఆశ కార్యకర్తలకు ప్రజలు సహకరించి తెల్లని మచ్చలు ఉంటే చూపించి సహకరించాలని రవీంద్ర యాదవ్ కోరారు.

## నేడు మండల సమావేశం

ధారూరు, మార్చి 10: మండల సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11:30 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ధారూరు ఎంపీడీవో నర్సింహులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ జైదు పల్లి విజయలక్ష్మి ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని తెలిపారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులు, మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు,కో-ఆప్షన్ సభ్యులు హాజరు కావాలని తెలిపారు.

## 12న వేలం పాట

కులకచర్ల, మార్చి 10 : ఈ నెల 12న కులకచర్ల మండల పరిధిలోని బండ వెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కొబ్బరి కాయల విక్రయానికి వేలం పాట నిర్వ హిస్తున్నట్లు దేవాలయ చైర్మన్ నర్సమ్మా రాములు, ఈవో సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉగాది సందర్భంగా నిర్వహించే పెద్ద జాతర మార్చి 30 నుంచి ఏప్రిల్ 9వరకు కొబ్బరి కాయల విక్రయానికి వేలం పాట మంగళవారం ఉదయం 11.30లకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు.

## బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా మహిపాల్

కులకచర్ల, మార్చి 10 : వికారాబాద్ జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడిగా కులకచర్ల బీజేపీ మాజీ అధ్యక్షుడు గాదె మహిపాల్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావుకు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూనేటి మారుతి కిరణ్‌కు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘనాపురం వెంకటయ్యకు ధన్యావాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు.

## రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కులకచర్ల, మార్చి 10 : మండల పరిధిలోని బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఉన్న కోనేరులో స్నానమాచరించిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.ఆలయ కమిటీ అధ్యక్షుడు నర్సమ్మా రాము లు, ఈవో సుధాకర్ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు.

# మందుబాబులకు అడ్డాగా వెంచర్లు

• కాలనీలవాసులకు ఇబ్బందులు • కలుషితమవుతున్న వాతావరణం • పోలీసులకు చెప్పినా ఫలితం లేదు

తాగి పడేసిన ఖాళీ మద్యం సీసాలు

పరిగి, మార్చి 10: పట్టణంలో బారు, మద్యం దుకాణాల పక్కనే సిట్టింగ్‌లకు అవకాశాలు ఉన్నప్పటికీ కొత్త వెంచర్లు మందుబాబుల అడ్డాగా మారాయి. తద్వారా ఆ పక్కనే నివాస ముంటున్న కాలనీల వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సాయంత్రం అయిందంటే చాలు మందుబాబులు మోటర్‌సైకిళ్లు, కార్లలో వచ్చి కొత్త వెంచర్లలో పార్టీలు చేసుకోవడం, రచ్చరచ్చ చేయడం నిత్యం కొనసాగుతున్నది. పరిగి పట్టణంలోని శివారు కాలనీలలో ఇది నిత్యకృత్యంగా మారిందని, పోలీసులకు చెప్పినా పెద్దగా ఉపయోగం లేకుండాపోయిందని పలువురు వాపో తున్నారు. పరిగి పట్టణ శివార్లలో ఉండే తిరుమల, మైత్రి, భవానీ నగర్‌లతో పాటు కొత్తగా ఏర్ప డుతున్న గంగాసదన్ వెంచర్లలో మందుబాబుల ఆగడాలు కొనసాగుతున్నాయి. సాయంత్రం ఆరు గంటలు దాటితేచాలు కొంతమంది మద్యం ప్రియులు బీరు బాటిల్స్ ఈ ప్రాంతాలకు తీసుకు వచ్చి పార్టీలు జరుపుకొంటున్నారు. గతంలో అడపాదడపా జరిగే ఈ మందుపార్టీలు ఇటీవల మరింత పెరిగాయి. రోజు ఇదే తంతు కొనసాగుతుండడంతో మందుబాబుల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆయా కాలనీల వాసులు పేర్కొంటున్నారు. కనీసం నాలుగైదు మంది ఉండే ఈ మందు పార్టీల వారు గుంపుగుంపులుగా చీకటిలో, సెల్‌ఫోన్ వెళుతురులో ఎలాంటి అడ్డంకులు లేకుండా పీకలదాకా మద్యం సేవించి నానా హంగామా సృష్టిస్తున్నారు. ఇదేమిటని ఎవరు ప్రశ్నించే పరిస్థితి ఉండదని ఆయా కాలనీలవారు పేర్కొన్నారు.

### వాకింగ్‌కు వెళ్లేవారికి ఇబ్బంది...

పట్టణ శివారులో నివాసముండే వారు ఉదయం, సాయంత్రం సమయాల్లో పక్కనే గల కొత్త వెంచర్లలో వాకింగ్‌కు వెళ్తుండగా ఉదయం సమయంలో ఖాళీ బీరు సీసాలు, పగిలిన సీసాల గాజుపెంకులు, తిని పడేసిన విస్తరాకులు దర్శనమిస్తుండగా సాయంత్రం సమయంలో అటువైపు వాకింగ్‌కు వెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. పట్టణ శివారులో, పక్కనే గల పంటపొలాలతో చక్కటి వాతావరణం ఉంటుందని తాము ఇండ్లు నిర్మించుకొని నివసిస్తున్నామని, మంచి వాతావరణంలో ఇలాంటి మందుబాబుల ఆగడాలతో తమకు ఇబ్బం దులు తలెత్తుతున్నాయని తెలిపారు. సాయంత్రం సమయంలో కుటుంబసభ్యులతో కలిసి వాకింగ్ చేసే పరిస్థితి లేదని వాపోతున్నారు. కొత్తగా వెలుస్తున్న వెంచర్లలో బీటీ రోడ్లు వేసి చదునుగా స్థలాలు ఉండడంతో ఇదే తమకు అనుకూలమైన అడ్డాలుగా మందుబాబులు మందు పార్టీలు చేసుకుంటున్నారు. పట్టణంలో ఒక బారు, మద్యం దుకాణాల పక్కనే గల సిట్టింగ్‌లలో మద్యం సేవించేందుకు అవకాశం ఉన్నప్పటికీ కొత్తగా వెలుస్తున్న వెంచర్లలో మందుపార్టీలతో ఈ ప్రాంతాలలో ఉండే ప్రశాంత వాతావరణాన్ని చెడగొడుతున్నారని వాపో తున్నారు. మందు తాగడంతోపాటు బిర్యానీలు, నాన్‌వెజ్ తెచ్చుకొని తిని విస్తరాకులు అక్కడే పడేస్తున్నారు. ఇదే విషయమై ఇటీవల కొందరు పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో గత వారం ఈ కొత్త వెంచర్లలో మందు సేవిస్తున్న వారిని పోలీసులు పట్టుకోగా అధికార పార్టీ నాయకుల ఫోన్‌లతో వారిని వదిలిపెట్టినట్లు తెలిసింది. పోలీసులు వారిని వదిలేసి తమకు ఏమి తెలియదన్నట్లుగా వ్యవహరించడం పట్ల తీవ్ర స్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. మందుబాబుల ఆగడాలకు చెక్ పెట్టాల్సిన పోలీసులు ఇలా పట్టుకొని, అలా వదిలేయడం సరికాదంటున్నారు. పోలీసులే ఇలాంటి చర్యలకు పాల్పడితే తమకు ఎవరు అండగా నిలుస్తారని ఆయా కాలనీల వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని తమ ప్రాంతంలో మందుబాబుల ఆగడాలకు చెక్ పడేలా చూడాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు. దీనిపై పరిగి ఎస్ఐ సంతోష్‌కుమార్ వివరణ కోరగా బహిరంగ ప్రదేశాల్లో మందు సేవించడం నిషేధమన్నారు. గస్తీ పెంచి వెంచర్లు, ఖాళీస్థలాల్లో సిట్టింగ్ వేసే మందుబాబులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

రోడ్డు పనుల్లో నాణ్యతను పరిశీలిస్తున్న డీఈ వెంకట్ రావు

పెద్దేముల్, మార్చి 10: గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తాండూరు డివిజన్ పంచాయతీరాజ్ డీఈ వెంకట్‌రావు అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని ఎర్రగడ్డ తండా లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గ్రామస్తులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో రూ.3 కోట్ల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 42 సీసీ రోడ్లు, 11 సైడ్ డ్రెయిన్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కాంట్రాక్టర్లు పనులను నాణ్యతతో చేపట్టాలని..లేనిచో బిల్లులను నిలిపేస్తానని హెచ్చరించారు. ముఖ్యంగా సీసీ రోడ్డు పనులను అవసరమున్న చోట మొదటి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ లు శంకర్, భరత్‌కుమార్, గోవర్ధన్, సంతోష్‌కుమార్, గ్రామస్తులు నారాయణ, లక్ష్మణ్, తదితరులున్నారు.

### ఆత్కూర్ గ్రామంలో..

పెద్దేముల్ మండల పరిధిలోని ఆత్కూర్ గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డులను ఆదివారం ఆత్కూర్ మాజీ సర్పంచ్ అంజిలప్ప,వార్డు సభ్యులు భీమా రాయుడు గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు.గ్రామాల్లో ఆ నిధులతో సీసీ రోడ్లు,మురుగుకాల్వల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు బ్రహ్మం, వార్డు సభ్యులు భీమా రాయుడు, రాఘవేందర్, కుర్వ సంగప్ప, నరేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

## కొడంగల్‌లో పోలీసుల కవాతు

కొడంగల్, మార్చి 10 : వచ్చే పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా పట్టణంలో శాంతి భద్రతలపై భరోసాను కల్పించేందుకు ఆదివారం సాయంత్రం పోలీసులతో పాటు ప్రత్యేక బలగాలు పట్టణం లో కవాతు నిర్వహించారు. గాంధీనగర్ ఆంజనేయస్వామి ఆలయం నుంచి అంబేద్కర్ కూడలి వరకు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో పరిగి డీఎస్పీ కరుణాసాగర్, సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై భరత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చలి వేంద్రం ప్రారంభం

పెద్దేముల్, మార్చి 10 : వేసవి దృష్ట్యా ప్రజలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు పెద్దేముల్‌కు చెందిన ఆటో యూనియన్ సభ్యులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్సై గిరి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆటో యూనియన్ సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్సై ప్రారంభించారు. కార్యక్రమంలో ఆటో వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు దర్మీది శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎండీ మోజం, కార్యదర్శి జనార్దన్, సలహాదారు ఆర్.మల్లప్ప, సభ్యులు సామెల్, రమేశ్, రవి, లాలు పాల్గొన్నారు.

## ఆదర్శప్రాయురాలు సావిత్రీబాయి పూలే



బొంరాస్‌పేటలో సావిత్రీబాయి పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

బొంరాస్‌పేట, మార్చి 10 : భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే ఎంతో ఆదర్శప్రాయురాలని టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ అన్నారు. పూలే వర్ధంతిని ఆదివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయ ఆవరణలో రవీందర్‌గౌడ్‌తో పాటు టీవీవీ నాయకులు బాకారం చంద్రశేఖర్, అనిల్ కుమార్, గౌరారం గోపాల్, శోభారాణి, సీఆర్‌పీ నర్సింహులు, వేణుగోపాల్ తదితరులు సావిత్రీబాయి పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ బాలికలకు విద్య కోసం సమాజాన్ని ఎదిరించి మొదటి సారిగా బాలికల కోసం పాఠశాలను స్థాపించారని, తదనంతరం దేశంలో 52 బాలికా పాఠశాలలను ఏర్పాటు చేసి వారికి విద్య నేర్పిందని అన్నారు.

## వైభవంగా ఓంకారేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



ఓంకారేశ్వర స్వామిని దర్శించుకున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కులకచర్ల, మార్చి 10 : చౌడాపూర్ మండల పరిధిలోని మందిపల్ గ్రామంలో ఓంకారేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మఠం రాజశేఖర్ ఎమ్మెల్యేకు తీర్థప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, శివశంకర్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్2 అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, కులకచర్ల పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, నాయకులు సాయి ముదిరాజ్, పుల్లప్ప, శివదర్శన్, మందిపల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బుచ్చయ్య పాల్గొన్నారు.

## వైభవంగా రామలింగేశ్వర స్వామి ఉత్సవాలు

భీమ్ భరత్‌ను సన్మానిస్తున్న ఆలయ చైర్మన్ మాణిక్ రావు

నవాబుపేట, మార్చి10 : మండల పరిధిలోని నారేగూడ గ్రామంలో ఉన్న భవానీ రామలింగేశ్వరాలయం బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయం చైర్మన్ పి.మాణిక్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామెన భీమ్ భరత్ హాజరయ్యారు. ఆదివారం జరిగిన బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భీమ్ భరత్ లింగేశ్వరుడి ఆలయం చరిత్ర, పరిసర ప్రాంతాల విషయాలు తెలుసుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రాంరెడ్డి, కృష్ణారెడ్డి, సరిత, భజన మండలి సభ్యులు, వేద పండితులు, గ్రామంలోని భక్తులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

బొంరాస్‌పేట, మార్చి 10 : కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని బొంరాస్‌పేట వైస్ ఎంపీపీ శ్రావణ్‌గౌడ్, మండల కోఆప్షన్ సభ్యుడు ఖాజా మైనుద్దీన్, మైనార్టీ సెల్ నాయకుడు అబ్దుల్ వాహబ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు సమావేశమై లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో వైఫల్యంచెందిన విషయాన్ని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు, కాంగ్రెస్, బీజేపీ లోపాయికారి ఒప్పందం గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ చేస్తున్న దాడులను ఖండిస్తూ పార్టీ కార్యకర్తలకు అండగా ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో పార్టీ నాయకులు రవిగౌడ్, లచ్చప్ప, సలాం, ముస్తఫా, ఉప సర్పంచ్ అంజిలయ్య, వసీం, రామకృష్ణగౌడ్, జమాల్ పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఆటల పోటీల్లో పాల్గొన్న యువతులు, మహిళలు.

బొంరాస్‌పేట, మార్చి 10 : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. మహిళలు, యువతులు, పిల్లలు ఉత్సాహంగా ఈ పోటీలలో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని అన్నారు. ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో పైకి రావాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జీవనజ్యోతి, కల్పన, షహీన్‌బేగం, మహిళలు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దోమ, మార్చి10: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-03 విద్యా సంవత్సరం పదోతరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఎస్‌జీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొన్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులను నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

## ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

యాలాల, మార్చి 10 : ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రాడికల్ బయో ఆర్గానిక్స్ లిమిటెడ్ (ఆర్‌బీఓఎల్) అధినేత, ఎమ్మెల్యే సోదరుడు శ్రీనివాస్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం చేస్తే ఆపదలో ఉన్న ఓ ప్రాణాన్ని కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, సీనియర్ నాయకుడు పట్లోళ్ల నర్సింహులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కులకచర్ల, మార్చి 10 : హన్మ్యనా యక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని హీర్యానాయక్‌తండాలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం అఖిల భారత బంజారా సేవా సంఘం పరిగి తాలూకా అధ్యక్షుడు నేనావత్ రాహుల్ నాయక్ పరిశీలించి మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధికి ఏబీబీఎస్ మాజీ జిల్లా అధ్య క్షుడు రవీందర్‌నాయక్ ఎంతో కృషి చేశాన్నారు. కార్యక్రమంలో హీర్యానాయక్, రాములు నాయక్, రాంచందర్, గోట్యానాయక్, రమేశ్, కిషన్, మోహన్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311806-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిముతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## ప్రతిభను వెలికితీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు

విద్యార్థులు తయారు చేసిన నమూనాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

బడంగ్‌పేట్, మార్చి 10 : విద్యార్థులో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతోగానో ఉపయోగపడుతాయని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం జల్‌పల్లి మున్సిపాలిటీ కాలనీలో షైన్ మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు తయారు చేసిన వివిధ నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యజీవితంలో సైన్స్ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్, ఉపాధ్యయులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు సన్మానం

వికారాబాద్, మార్చి 10 : పట్టణంలోని శ్రీరామ మందిరం సమీపంలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఆదివారం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్మన్ మంజుల మాట్లాడుతూ.. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుధ్య కార్మికులను ఎన్నిసార్లు సన్మానించిన తక్కువేనని అన్నారు. వారి సేవలను గుర్తించి సన్మానించిన బ్రహ్మకుమారీస్ ప్రతినిధి మధు అక్కయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ పరివారం, హెల్త్ అసిస్టెంట్ ఏసు, జవాన్లు వినోద్, చిన్నయ్య, రాజు, ఆశయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/శంకర్‌పల్లి తాండూర్/కొడంగల్ ఇబ్రహీంపట్నం/మహేశ్వరం } 80966 77668 : 80966 77962